క్లుప్తంగా

ప్రగతి ఆటో డ్రైవర్ యూనియన్ అధ్యక్షుడిగా సంజీవ్



హన్మకొండ అర్బన్: నగరంలోని సుబేదారిలోని ప్రగతి ఆటో డ్రైవర్ యూనియన్ (ఈ–80) అధ్యక్షుడిగా జన్ను సంజీవ్ ఎన్నికైయ్యారు. సోమవారం జరిగిన యూనియన్ ఎన్నికల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎస్కె రాఫిక్, కార్యదర్శిగా జనగాం యాదగిరి, సహాయ కార్యదర్శిగా సిలువేరు సుధాకర్, కోశాధికారిగా జనగాని కుమారస్వామి, ప్రచార కార్యదర్శి మేకల అనిల్‌తోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

కేడీసీలో జాబ్‌మేళా

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్ మేళా నిర్వహించారు. టీఎస్‌కేసీ, ప్లేస్‌మెంట్ సెల్ సంయుక్తంగా నిర్వహించాయి. 12 కంపెనీలు ఈ జాబ్‌మేళా నిర్వహించగా వివిధ కళాశాలల నుంచి 170 మంది విద్యార్థులు ఎంపిక కాగా కేడీసీ నుంచి 18మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజారెడ్డి తెలిపారు.

రవికుమార్‌కు వాసవీ సేవా పురస్కార్



హన్మకొండ అర్బన్: నగరంలోని పలివేల్పుల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెనిశెట్టి రవికుమార్ వాసవి సేవా నంది పురస్కారాన్ని అందుకున్నారు. విజయవాడలోని విద్యాధరపురం వాసవీ క్లబ్ , క్లబ్ అధ్యక్షురాలు పానుగంటి లలితారాణి సంయుక్తంగా విజయవాడలోని రథం సెంటర్‌లోని వాసవి సత్రంలో ఆదివారం అవార్డుల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, క్లబ్ గవర్నర్ మిత్ ఇంటీ రాధా, పానుగంటి లలితారాణిల చేతుల మీదుగా రవికుమార్ ఈ పురస్కారాన్ని అంజేశారు. ఈ మేరకు రవికుమార్‌ను ఎంఈఓ రాంకిషన్ రాజు, మర్కజీ స్కూల్ హెచ్‌ఎం ఉమారెడ్డి, శంకర నారాయణ, కాజీపేట వాసవీ క్లబ్ సభ్యులు వెనిశెట్టి రఘు, కేయూ సెనేట్ మెంబర్ పోకల చందర్‌లు అభినందించారు.

డాక్టర్ లక్ష్మణ్‌ను కలిసిన ఓబీసీ జిల్లా అధ్యక్షుడు



ఖిలా వరంగల్: బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు, పార్లమెంటరీ బోర్డ్ మెంబర్ డాక్టర్ లక్ష్మణ్‌ను సోమవారం ఖిలా వరంగల్ తూర్పుకోటకు చెందిన ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్ హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ఓబీసీ బలోపేతానికి మరింతగా కృషి చేయాలని లక్ష్మణ్ తెలిపారు. ఆయనను కలిసిన వారిలో జడ సతీష్, బొలుగొడ్డు సతీష్, ఏసీరెడ్డి రంజిత్, నాంద్రే అమర్‌నాథ్ తదితరులు ఉన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం



ఖిలా వరంగల్: వరంగల్ 17వ డివిజన్ గాడిపెల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ

కాజీపేట రూరల్: కాజీపేట దర్గా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో తమ ప్రతిభను కనబరిచి పతకాలు సాధించారని దర్గా ప్రభుత్వ పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు సంతోష్‌కుమారి అన్నారు. ఇటీవల ఓరుగల్లు డ్రాగన్ స్కూల్ ఆఫ్ జపాన్ కరాటే షోటోకాయ్ కాజీపేట ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో వైశాలి, నందిని, సిరి, సహస్ర అనే విద్యార్థులు పతకాలు సాధించారన్నారు. ఈమేరకు వారిని అభినందించారు. టోర్నమెంట్ నిర్వాహకుడు నాగమహేష్, యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోమటిరెడ్డి దిష్టిబొమ్మ దహనం

కేయూ క్యాంపస్: తెలంగాణ ఉద్యమకారుడు, ఉద్యమంలో తొలి పీడీ యాక్ట్ కేసు నమోదు అయిన డాక్టర్ చెరుకు సుధాకర్ మీద భువనగిరి ఎంపీ కోమటి రెడ్డి వెంకటరెడ్డి బెదిరించడాన్ని నిరసిస్తూ బహుజన విద్యార్థి సంఘం (బీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం కేయూ మొదటి గేట్ వద్ద కోమటిరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ మాట్లాడారు.

ప్రయాణికురాలిని సన్మానిస్తున్న డీసీపీ పుష్ప



మడికొండలో..



హన్మకొండ అర్బన్: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రమౌళి, వేదికపై అతిథులు



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పలువురు అధికారులు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం గ్రేటర్ వరంగల్ పరిధిలో ముందస్తు మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని మహిళా ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహించారు.

–సాక్షి నెట్‌వర్క్



హన్మకొండ అర్బన్: మహిళా ఉద్యోగుల క్రీడలు ప్రారంభిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్



కాజీపేటలో మాట్లాడుతున్న రాఘవరెడ్డి



ఎంజీఎం: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యులు



కాజీపేట అర్బన్‌లో..

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేందర్

కాశిబుగ్గ: అన్ని వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం కేసీఆర్ పేదల దేవుడని తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. సోమవారం 19వ డివిజన్‌లో పర్యటించి లబ్ధిదారుల ఇంటింటికి తిరుగుతూ రూ.18 లక్షలు విలువచేసే కల్యాణలక్ష్మి, సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా సీఎం కేసీఆర్ పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదలకు అండగా ఉంటున్నారన్నారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్, ఈటల ఉమామహేందర్, భూక్యా మోతిలాల్ నాయక్ ఉన్నారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

కేయూ క్యాంపస్: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య అన్నారు. సోమవారం కళాశాలలోని 'సామాజిక శాస్త్రాలు, కళాశాల ఐక్యూ ఏసీ లక్ష్యాల నిర్దేశం– విద్యార్థుల బాధ్యత' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో యువత 40 శాతం మంది ఉన్నారని, వారంతా పట్టుదలతో ముందుకెళ్లి లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య జి.హనుమంతు, అధ్యాపకులు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోధ్, డాక్టర్ తిరునహరిశేషు, వీరస్వామి, లక్ష్మినారాయణ, భిక్షపతి, చిర్ర రాజు, రమేష్, సంజీవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థను గమనించాలి

దేశంలోని ఆర్థిక వ్యవస్థను మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఎప్పటికప్పుడు అవగతం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య కోరారు. సోమవారం కళాశాలలోఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు నిత్యం వ్యాపార ధోరిణి, ఆర్థిక వ్యవస్థను పారిశ్రామిక విధానం, పరిపాలన వ్యవహారాలు గమనించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ హనుమంతు, అధ్యాపకులు డాక్టర్ కనకయ్య, సురేష్, గిరిప్రసాద్, నరేందర్‌నాయక్, శ్రీనివాస్, సోమశేఖర్ పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

విద్యారణ్యపురి: రక్తదానం మరొకరికి ప్రాణదానం చేసినట్లు అవుతుందని హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజారెడ్డి అన్నారు. సోమవారం కేడీసీలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తలసేమియాతో బాధ పడుతున్న చిన్నారులకు రక్తం కొరత ఉన్నందున అందరూ రక్తదానం చేసి వారి ప్రాణాలను కాపాడాలన్నారు. 120 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సంజీవయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎం రాంబాబు, డాక్టర్ పి.సాయిలు, డాక్టర్ ఎస్ వినోద్‌రావు, డాక్టర్ ఇందిరానైనాదేవి, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ కె.ఓంకార్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జె.సోమన్న అధ్యాపకులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు శ్రమించాలి



జ్ఞాపికలు అందుకున్న విద్యార్థినులు

హన్మకొండ: లక్ష్య సాధనకు విద్యార్థులు నిరంతరం శ్రమించాలని కాకతీయ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రెసిడెంట్ గుండా హరినారాయణ, కరస్పాండెంట్ మట్టెవాడ మాదవ్ అన్నారు. సోమవారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో కాకతీయ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో మైత్రిమీట్ జరిగింది. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రెసిడెంట్ గుండా హరినారాయణ, మట్టెవాడ మాదవ్, ఎం.దయాకర్, రవీందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వళన చేసి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మహిళలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణ, వైస్ ప్రిన్సిపాల్ జి.సంతోష్ బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏబీఎస్‌ఎఫ్ రాస్తారోకో



కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో చేస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: సమస్యల పరిష్కారం కోసం పోరాడితే అక్రమ కేసులు పెట్టడం సరికాదని అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ (ఏబీఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ అన్నారు. సోమవారం కేయూ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పోలీసులు విద్యార్థులపై దాడి చేయడం సరికాదన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు మచ్చ పవన్‌కళ్యాణ్, మధు, సంజీవ్, పవన్, సతీష్, ఆకాష్, శ్రవణ్, రాజేందర్, రాజవర్ధన్‌రెడ్డి, శృతి, అఖిల, కావ్య, రమ్య, సౌజన్య, హైమ, తదితరులు పాల్గొన్నారు. కాగా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తుండటంతో కాజీపేటకు వెళ్లే రోడ్డు పూర్తిగా మూసేశారు. దీంతో రెండు వైపులా ఒకే రోడ్డుపై వెళ్లే క్రమంలో ఓ ద్విచక్ర వాహనదారుడు డివైడర్‌ను ఢీకొనడంతో ప్రమాదానికి గురయ్యాడు. ఉన్నతాధికారుల అనుమతితో కలెక్టరేట్ 108 వాహనం సిబ్బంది పైలట్ బాలాజీనాయక్, ఈఎంటీ చైతన్య క్షతగాత్రుడిని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

వైద్య విధానాలకు మూలం ఆయుర్వేదం



ఆయుర్వేద వైద్యశాల ఎదుట విద్యార్థులు

కాశిబుగ్గ: సకల వైద్య విధానాలకు మూలం ఆయుర్వేదమని వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ అన్నారు. వరంగల్ ఆయుర్వేద వైద్య కళాశాల మొదటి సంవత్సరం (నూతన బ్యాచ్) బీఏ ఎంఎస్ (2022–23) విద్యార్థులు ట్రాన్సిషనల్ కరిక్యులమ్‌లో భాగంగా సోమవారం బోధన వైద్యశాలకు వచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్యశాల గురించి వివిధ విభాగాలను, వాటిలో అందిస్తున్న వైద్య సేవలపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ జగన్మోనాచారి, బాల్నె విజయ్, కె అలేఖ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఖిలా వరంగల్: చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్యానల్ న్యాయవాది కె.గోపికారాణి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వరంగల్ చైర్మన్ కె.రాధాదేవి ఆదేశాల మేరకు సోమవారం వరంగల్ శివనగర్‌లోని మీసేవ భవనంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో రమేష్, మెప్మా సీఓలు ప్రవీణ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలు చేయాలి

మడికొండ: పోటీ ప్రపంచంలో సైన్స్ అండ్ టెక్నాలజీని వినియోగించుకొని నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని 64 డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి అన్నారు. సోమవారం డివిజన్‌లోని రామన్ హైస్కూల్‌లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ స్రవంతి, కరస్పాండెంట్ రాజేష్‌కుమార్, పురుశోత్తమ్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



కాజీపేట: కాజీపేట భ్రమరాంభిక మల్లిఖార్జునస్వామి దేవాలయంలో సోమవారం పండితులు వివి ద రకాల పూలతో ప్రత్యేక అలంకరణ పూజలు ఘనంగా జరిపించారు. గంగా నది నుంచి భక్తులు తెచ్చిన నది జలాలతో స్వామి వారికి సహస్రధారలతో అభిషేకాలు జరిపించారు. ఆలయ ప్రధాన పూజారి ఐనవోలు ప్రవీణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో పండితులు మోదుగు పూలు, మల్లెలు, కనకాంబరాలతో మహదేవుడిని అలంకరించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కాజీపేట: కాజీపేట సోమిడి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు యూత్ ఫర్ సేవ సంస్థ వారు అందించిన ఆల్ ఇన్ వన్ పాఠ్య పుస్తకాలను సోమవారం హెచ్‌ఎం జి.నెహ్రూ పంపిణీ చేశారు.

కంట్లో కారమే!

మిర్చి ధర నిర్ణయం దళారులదే..

- అడ్తిదారులు చెప్పిన రేటుకే అమ్ముకుంటున్న రైతులు
- సరుకు నాణ్యతగా ఉన్నా పట్టించుకోని అధికారులు
- ఏనుమాముల మార్కెట్‌కు 60వేల బస్తాలకుపైగా రాక



ఏనుమాముల మార్కెట్‌లో విక్రయానికి వచ్చిన మిర్చి బస్తాలు

వరంగల్: మార్కెట్‌కు సరుకు విక్రయానికి వస్తున్న కొద్దీ దళారుల ప్రమేయం ఎక్కువవుతోంది. పెద్ద మొత్తంలో మిర్చి బస్తాలు వస్తే చాలు ధర పడిపోవడం రివాజుగా మారుతోంది. నాణ్యతగా ఉన్న తమ సరుకుకు మంచి రేటు వస్తుందనే ఆశతో మార్కెట్‌కు వస్తే అడ్తిదారుడు చెప్పిన ధరకే రైతులు అమ్ముకోవాల్సి వస్తోంది. వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో ధరల నిర్ణయంలో దళారుల దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతుండగా.. ఆరుగాలం పంట పండించి అమ్మకానికి తెచ్చిన రైతులకు మాత్రం ఏమీ మిగలని పరిస్థితి నెలకొంది. సోమవారం వ్యవసాయ మార్కెట్‌కు పెద్ద ఎత్తున మిర్చి వచ్చిందన్న సమాచారం మేరకు సందర్శించగా.. పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.

సీజన్ ప్రారంభంలో మిర్చి ధరలు రికార్డు స్థాయిలో పలకడంతో రైతులు ఉత్సాహంగా పండిన వరకు వెంటనే మార్కెట్‌కు విక్రయానికి తరలిస్తున్నారు. దేశంలో మిర్చి నిల్వలు తగ్గడంతో అడ్తిదారులు నవంబర్ నుంచి కోల్డ్ స్టోరేజీల్లో సరుకు నిల్వ చేశారు. ప్రస్తుతానికి రోజుకు 100 నుంచి 1000 బస్తాలకు వరకు తీసుకొచ్చి విక్రయించడంతో ధరలు గరిష్ఠంగా నమోదయ్యాయి. తేజ రకానికి రూ.16వేల నుంచి రూ.21,800, యూఎస్–341 రకానికి రూ.22వేల నుంచి రూ.27వేల వరకు ధర చెల్లించారు. డిసెంబర్ రెండో వారం నుంచి కొత్త మిర్చి మార్కెట్‌కు రావడం మొదలైంది. దీంతో కోల్డ్ స్టోరేజీ మిర్చితోపాటు కొత్త మిర్చికి అధిక ధర చెల్లించేందుకు కొనుగోలుదారులు పోటీ పడ్డారు. ఈ మిర్చి కేవలం 500 నుంచి 3వేల బస్తాల వరకే మార్కెట్‌కు రావడంతో గరిష్ఠ ధరలను 5–10 బస్తాల వరకు వర్తింపజేస్తూ.. మిగిలిన మిర్చి తడిగా, మచ్చలు ఉన్నాయనే కారణాలు చూపుతూ రూ.12వేల నుంచి రూ.16వేల వరకు కొనుగోలు చేయడంతో రైతులు పెద్దగా ఇబ్బంది పడలేదు. సంక్రాంతి పండుగ తర్వాత మిర్చిని రైతులు పెద్ద మొత్తంలో మార్కెట్‌కు తరలిస్తున్నారు. దీనిని దళారులు అవగాహన చేసుకుని నాణ్యత గల సరుకైనప్పటికి క్వింటాల్‌కు రూ.2వేల నుంచి రూ.3వేల వరకు తగ్గిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కాగా.. మార్కెట్‌కు 60వేల బస్తాలకుపైగా మిర్చి విక్రయానికి వచ్చింది.

నాణ్యత, తేమ బూచీ..

అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది మిర్చి రైతుల పరిస్థితి. సరుకుకు ధరలు ఎలా నిర్ణయిస్తున్నారన్న విషయాలను మార్కెట్ అధికారులు పట్టించుకోని పరిస్థితులు నెలకొన్నాయి. సరుకులో తేమ ఏ మేరకు ఉంది.. నాణ్యతా ప్రమాణాలు ఎలా ఉన్నాయి.. అని నిర్ధారించడంలో స్పష్టత లేకపోవడంతో దళారులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం ఒకే రకం ఉన్న మిర్చికి జెండా పాటలో క్వింటాల్‌కు రూ.21,100 నిర్ణయించి వెళ్లగా.. తర్వాత వచ్చిన అడ్తిదారులు తమకు రూ.18వేల వరకు ధర నిర్ణయించారని రైతులు ఆరోపిస్తున్నారు.

దిగుబడి రాలే...



రెండెకరాల మిర్చి తోట వేశాను. రూ.లక్ష పెట్టుబడి అయ్యింది. అకాల వర్షాలు, ఇతర కారణాలతో దిగుబడి తగ్గింది. గత వారం క్వింటాల్‌కు రూ.21వేల నుంచి రూ.22వేల వరకు పలికింది. ధరలు బాగున్నాయని మార్కెట్‌కు తీసుకొస్తే రూ.18వేల నుంచి రూ.19వేలు ఇస్తున్నారు. ఖర్చులు పోను మిగిలే అవకాశం లేదు.

– ఆకుతోట వెంకటేశ్వర్లు, మాధన్నపేట, నర్సంపేట

ధరలు తగ్గాయి..



ఏనుమాముల మార్కెట్‌కు తేజ రకం మిర్చి గత వారం తీసుకొస్తే క్వింటాల్‌కు రూ.21వేలు పలికింది. అదే సరుకు ఇప్పుడు తెస్తే రూ.18వేల చొప్పున ఇస్తున్నారు. ఎందుకు ధరలు తగ్గాయో అర్థంకాని పరిస్థితులు ఉన్నాయి. ఖరీదుదారుడు చెప్పిన ధరలకు ఇవ్వక తప్పడం లేదు. ఇంత కష్టపడినా ఏమీ మిగలడం లేదు.

– శేఖర్, రైతు, గోరికొత్తపల్లి, రేగొండ మండలం

గిట్టుబాటు ధర అందిస్తున్నాం..



పక్కనే ఉన్న ఖమ్మం మార్కెట్ కంటే మన దగ్గరే ఎక్కువ ధరలు లభిస్తున్నాయి. మిర్చి నాణ్యత, తేమను పరిశీలించి ధర నిర్ధారిస్తారు. క్వాలిటీ ఉన్న మిర్చికి ఎక్కువ ధర పలుకుతుంది. మన వద్దకు సుమారు 10 రకాల మిర్చి వస్తుంది. రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు అధికారులుగా మేం సిద్ధంగా ఉన్నాం.

– బీవీ.రాహుల్, ఉన్నత శ్రేణి కార్యదర్శి, వరంగల్

దంత సంరక్షణపై అవగాహన

ఖిలా వరంగల్: దంత సంరక్షణపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వాగ్భాట యోగా అండ్ వార్క్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెసర నిరంజన్ రెడ్డి సూచించారు. డెంటిస్ట్ డేను పురస్కరించుకుని సోమవారం శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో వాగ్భాట యోగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మధు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురి కాలనీలో జరిగిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ పరిశీలించారు. సీసీ రోడ్డు పది కాలాల పాటు నాణ్యతగా ఉండాలంటే నీరు చక్కగా పట్టించాలని కాలనీవాసులకు సూచించారు.

ఎండీడీపీ కిట్ల పంపిణీ

నయీంనగర్: బోధకాలు వ్యాధిగ్రస్తులకు ఎండీడీపీ కిట్లను ప్రభుత్వ మెటర్నిటీ ఆస్పత్రిలో సోమవారం 6వ డివిజన్ కార్పొరేటర్ చెన్నం మధు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఆశవర్కర్లు ఇంటింటికి తిరిగిబోధకాలు వ్యాధి గ్రస్తులకు అవగాహన కల్పించాలన్నారు.

సంక్షిప్త సమాచారం

బీరువా బహూకరణ

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి దేవాలయానికి ముచ్చర్లకు చెందిన చల్లా భాగ్యలక్ష్మీ–వెంకటేశ్వర్లు, ఎర్రగట్టుగుట్ట ప్రాంతానికి చెందిన తోట సంధ్యారాణి– నాగరాజు దంపతులు సంయుక్తంగా బీరువా బహూకరించారు.

పొదుపు అలవర్చుకోవాలి

మడికొండ: ప్రతి ఒక్కరు పొదుపును అలవర్చుకోవాలని శ్రీ సాయి పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు చందరాజు జయపాల్ అన్నారు. సోమవారం సంఘం 9వ వార్షికోత్సవ మహాసభ నిర్వహించారు.

పెట్టుబడి లేకుండానే పరిశ్రమల ఏర్పాటు

హసన్‌పర్తి: కొత్త ఆలోచనలతో ఎలాంటి పెట్టుబడి లేకుండా పరిశ్రమలు ఏర్పాటు చేయవచ్చని పారిశ్రామిక వేత్త శశి అన్నారు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఎంటర్ ప్రెన్యూరల్ వీక్‌లో భాగంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంగా ఎదుర్కొవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆజరా ఆస్పత్రి సీఈఓ డాక్టర్ వెంకటేశ, డాక్టర్ వశిష్ఠ, ఏఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

హన్మకొండ: డాక్టర్ ప్రీతి మృతికి కారకులైన కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్, హెచ్ఓడీ, ఎంజీఎం సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేసి హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని ప్రీతి న్యాయ పోరాట కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ హరిత హోటల్‌లో ప్రీతి న్యాయ పోరాట కమిటీ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ నెల 8న హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేయనున్నామని వారు తెలిపారు.

నగరంలో కాముడిదహనం



హన్మకొండ: కాముడిదహనం చేస్తున్న గోకుల్‌నగర్‌వాసులు

హన్మకొండ /కాజీపేట/ వరంగల్ చౌరస్తా/ఖిలావరంగల్: త్రినగరిలో సోమవారం రాత్రి కాముడిదహనం నిర్వహించారు. వివిధ కాలనీ వాసులు ప్రతి ఇంటి నుంచి కర్రలు, ఇతర వస్తువులు తీసుకువచ్చి కూడలిలో పేర్చి శాస్త్రోక్తంగా కాముడిదహనం చేశారు.